నిరుపయోగంగా 'డబుల్' ఇళ్లు

- నిర్మాణం పూర్తయిన పంపిణీకి నోచుకోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం



వంగపల్లిలో నిరుపయోగంగా మారిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

పగిలిన కిటికీ అద్దాలు

యాదగిరిగుట్ట రూరల్ : పేదల సొంతింటి కలను నెరవేర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చింది. ఇందులో భాగంగా మండలంలోని వంగపల్లి గ్రామంలో నిర్మించిన ఇళ్లు పూర్తయి, లబ్ధిదారులు ఎంపిక ప్రక్రియ సైతం పూర్తియింది. కానీ నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో అవి నిరుపయోగంగా మారి మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్న నిర్మించిన ఇళ్లను తమకు కేటాయించడం లేదని.. ఈ విషయాన్ని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు. డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కోసం లబ్ధిదారులు ఆశగా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

రూ.21.60కోట్లతో ..

వంగపల్లి గ్రామంలో 40 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను సుమారు రూ.21.60కోట్లతో నిర్మించారు. నిర్మాణ పనులు పూర్తయి రెండేళ్లు గడుస్తున్న లబ్ధిదారులు పంపిణీ చేయలేదు. దీంతో ఇళ్ల సముదాయం చుట్టూ పిచ్చిమొక్కలు పెరుగగా.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. గుర్తు తెలియని దుండగులు కిటికీ అద్దాలు పగులగొడుతున్నారు. పైపులు, వైర్లు చోరీ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులు కేటాయించాలని పలువురు కోరుతున్నారు.

నిర్మాణ పనులు పూర్తయ్యాయి

"వంగపల్లి గ్రామంలో 40 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయి. సెప్టిక్ ట్యాంక్ స్లాబ్ పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. అంతర్గత రోడ్డును వేయాల్సి ఉంది. ఆ పనులు కూడా పూర్తి చేయిస్తాం.

– ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

"వంగపల్లి గ్రామంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించి గతంలో గ్రామ సభ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశాం. ప్రభుత్వం మారడంతో లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వడంలో ఆలస్యం జరుగుతోంది ఇళ్లను లబ్ధిదారులకు కేటాయింపుపై ఉన్నతాధికారులకు తెలియ జేశాం. వారి నుంచి ఆదేశాలు వస్తే పంపిణీ చేస్తాం.

– గణేష్ నాయక్, యాదగిరిగుట్ట తహసీల్దార్

క్లుప్తంగా

సీపీఐ అభ్యర్థులను గెలిపించాలి



ఆలేరురూరల్ : మాట్లాడుతున్న వెంకటేష్

ఆలేరురూరల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ అన్నారు. ఆదివారం మండలంలోని కొలనుపాక గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ మండల అధ్యక్షులు చౌడబోయిన కనకయ్య, పొన్నబోయిన రవి, పోతు ప్రవీణ్, బొడ్డు ఆంజనేయులు, గ్యార భిక్షపతి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

చండూరు : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం చండూరు పట్టణంలోని మాదగోని నర్సింహ భవన్‌లో జరిగిన కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఐకి బలమున్న అన్ని గ్రామాల్లో పోటీకి నాయకులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య, మండల కార్యదర్శి నలపరాజు సతీష్, సహాయ కార్యదర్శి బొడ్డు వెంకన్న, జిల్లా కౌన్సిల్ సభ్యుడు తిప్పర్తి రాములు, నాయకులు బరిగల వెంకటేశ్, దోటి వెంకన్న, బండమీది వెంకన్న, ఊషయ్య, రమేష్, సంజీవ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని పిలాయిపల్లి గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మంజూరైన నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆదివారం కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గొడిసె నాగభూషణం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పెరుమాళ్ల దానయ్య, ఆకుల అంజయ్య, ఆకుల సులోచన, బైండ్ల దరశథ, పన్నీరు అంజయ్య, మెట్టు రాంరెడ్డి, కొమ్మన స్వామి పాల్గొన్నారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా సుక్క శ్రీకాంత్



వలిగొండ : మండలకేంద్రంలో ఆదివారం బహుజన సమాజ్ పార్టీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడిగా సుక్క శ్రీకాంత్ ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గండమల్ల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీల ఎన్నిక



భువనగిరి : నూతన కార్యవర్గ సభ్యులు

భువనగిరి : మండలంలోని బొల్లెపల్లి గ్రామంలో ఆదివారం హనుమాన్ యూత్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షుడిగి బుంగపట్ల శివప్రసాద్, ప్రధానకార్యదర్శిగా క్లెం బసవరెడ్డి, కోశాధికారిగా ఎలిమినేటి అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా బుంగపట్ల రమేష్, బోల రమేష్, దాసరి రాంరెడ్డి, సాంస్కృతిక కార్యదర్శిగా గోర్ల వీరాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు గాదె శివప్రసాద్, బద్దం సంపత్‌రెడ్డి, సింగిరెడ్డి దేవేందర్ రెడ్డి, పల్లె రమేష్‌రెడ్డి, పన్నీరు బాలకృష్ణ, కొండ మాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరి సంఘం యూత్ ..

భువనగిరి : పట్టణ కేంద్రంలో ఆదివారం కుమ్మరి సంఘం యూత్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా జీవిలికపల్లి వెంకట్, ప్రధాన కార్యదర్శిగా జాగిల్లాపురం మహేష్ ఎన్నికయ్యారు.

టీఆర్‌పీ గ్రామ శాఖ ఎన్నిక

తుర్కపల్లి : మండలంలోని మాదాపూర్ గ్రామంలో ఆదివారం తెలంగాణ రాజ్యాధికార పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా కొమరయ్య,గౌరవ అధ్యక్షులుగా పనగట్ల రాజనర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా పనగట్ల లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా జాలిగం స్వామి, తునికి కృష్ణ పబ్బ సంతోష్, యూత్ అధ్యక్షుడిగా సిద్దంకి మురళి, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కొమ్ము అశోక్, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా రావత్ భాస్కర్ నాయక్ ఎన్నికయ్యారు.

సాయి బాబా ఆలయ ట్రస్ట్ బోర్డు

ఆలేరు : ఆలేరులోని సాయిబాబా దేవాలయం ట్రస్ట్ బోర్డు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ట్రస్ట్ చైర్మన్ బొట్ల పరమేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపార. వైస్ చైర్మన్లుగా కామిటికారి అశోక్, సముద్రాల సత్యం, ప్రధాన కార్యదర్శిగా ఎస్.శ్రీనివాస్, కార్య నిర్వాహక కార్యదర్శిగా అయిత వెంకటేశ్వర్లు, కోశాధికారిగా మురారి శెట్టి రాజేశ్వర్, సహాయ కార్యదర్శిగా సీతనవీన్ ఎన్నికయ్యారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి

బొమ్మలరామారం : ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు రాగుల బల్‌రామ్ అన్నారు. మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజ్‌లకు ప్రాధాన్యం కల్పించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో క్రియశీలకంగా మారి ప్రజా సేవలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గొడుగు చంద్రమౌళి, మామిళ్ల కృష్ణ, ఎలబోయిన రవి శంకర్, ప్యారారం రాములు,తాడెం అంజనేయులు, బాల్‌రాజ్, గణేష్, మహేష్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రజక కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

బొమ్మలరామారం : అన్నిరంగాల్లో వెనుకబడిన రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని రజక వృత్తిదారుల సంఘం మండల అధ్యక్షుడు జూపల్లి శ్రీకాంత్ అన్నారు. మండలంలోని చీకటిమామిడిలో ఆదివారం నిర్వహించిన మండల రజక వృత్తిదారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రజకు వృత్తిదారుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముదిగొండ శ్రీనివాస్, ఎడిజర్ల భూపాల్, జూపల్లి భరత్, భాలకృష్ణ, మహేష్, అనిల్, జంగయ్య, గణేష్, లింగయ్య, పాపులు,భూములు,నగేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



పెద్దరావులపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని పెద్దరావులపల్లి గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి, హిందూ జ్ఞాన వేదిక కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రచారం చేశారు. త్రైత సిద్ధాంత ఆధ్మాత్మిక గ్రంధాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు దేవేంద్ర, భువనగిరి, జనగామ, చేర్యాల, తొర్రూర్ కమిటీ సభ్యులు శంకర్, భాస్కర్, రామకృష్ణ, వాత్సవ్, సాయిరాజు, అశోక్, కవిత తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

రాజాపేట : మండలంలోని నర్సాపురం గ్రామానికి చెందిన పాడి రైతు, పాల సంఘం మాజీ చైర్మన్ రామిడి బాపిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లా మదర్ డెయిరీ డైరెక్టర్ సందిల భాస్కర్ గౌడ్ పాడి రైతు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం చైర్మెన్లు జన్నపల్లి బాలరాజు రెడ్డి, రంగపాండు, పాసుకొండ దశరథ, ఎమ్మ వెంకటేశం, గుంటి శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, గొల్లపల్లి మల్లారెడ్డి, కృష్ణ, గుర్రాల రాజు పాల్గొన్నారు.

దేశానికి సేవ చేయడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం



చౌటుప్పల్ : మాట్లాడుతున్న యువరాజు



తుర్కపల్లి : శతాబ్ది ఉత్సవంలో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

చౌటుప్పల్ : దేశానికి సేవ చేయడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని ఆర్ఎస్ఎస్ పర్యావరణ సంరక్షణ తెలంగాణ ప్రాంత యువశక్తి కార్యవిభాగం సహ ప్రముఖ్ చినుకని యువరాజు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో ఆదివారం జరిగిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కానుగు శేఖర్, బొమ్మకంటి శ్రవణ్, నక్కరగోని వెంకటేష్, గోపనబోయిన సతీష్, రమాకాంత్ పాల్గొన్నారు.

తుర్కపల్లి : మండల కేంద్రంతో పాటు మాదాపూర్ గ్రామంలో ఆదివారం రాష్ట్రయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మాదాపూర్ గ్రామంలోని దేవాలయ ప్రాంగణంలో కవాతు నిర్వహించారు.

ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మోటకొండూర్ : అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అశోక్

మోటకొండూర్ : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అశోక్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం సైక్లింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలు, చీటింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమానస్పద వ్యక్తులు కన్పిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. వాట్సాప్ ద్వారా గుర్తు తెలియని వ్యక్తుల నంబర్‌ను వచ్చే లింక్‌లను ఓపెన్ చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఎండీ లతీఫ్, బచ్చ శ్రీశైలం, బుగ్గ నాగరాజు, రేగు మల్లేష్, దేవరకొండ జగస్, పోతుగంటి చందు తదితరులు పాల్గొన్నారు.

వామ్మో కోతులు



ఆలేరు బస్టాండ్ ఆవరణలో కోతుల గుంపు

ఆలేరు: పట్టణంలో కోతుల బెడద ఎక్కువైంది. ఇళ్లపై, వీధుల వెంట గుంపులు గుంపులుగా సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా ఆలేరు బస్టాండ్ ఆవరణలో కోతులు గుంపులుగా సంచరిస్తుండడంతో బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లలోకి చొరబడి వస్తువులను చిందరవందర చేస్తున్నాయని పలువురు వాపోతున్నారు. అధికారులు స్పందించి కోతుల బెడదను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

భూ నిర్వాసితుల సమావేశం

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని సర్వేల్ గ్రామంలో ఆదివారం రీజనల్ రింగ్ రోడ్డు భూనిర్వాసితుల మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రీజనల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని కోరుతూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కారికి పంపించాలని తీర్మానం చేశారు. అన్ని పార్టీలు కలిసిరావాలని కోరారు. ఈ సమావేశంలో పలువురు రీజనల్ రింగ్‌రోడ్డు భూనిర్వాసితులు పాల్గొన్నారు.

చెట్లమధ్యలో వర్షమాపక కేంద్రం

రాజాపేట : మండలంలోని పాముకుంట, రాజాపేట మండల కేంద్రంలో వర్షపాతాన్ని తెలిపే వర్షమాపక కేంద్రాలు ఉన్నాయి. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుకాల మాన్యువల్ కేంద్రం ఉండగా, మరో రెండు ఆటోమెటిక్ వర్షమాపక కేంద్రాలు ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయం వెనకాల ఎలాంటి బద్రత లేకుండా వర్షమాపక కేంద్రం (రెయిన్‌గేజ్) ఉంది. దానిచుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి దీంతో సరైన వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉంది. వర్షమాపక కేంద్రంలోకి ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు ఫెన్సింగ్ ఏర్పాచేసి కేంద్రం పరిధిలో చెట్లు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



రాజాపేట తహసీల్దార్ కార్యాలయంలో పిచ్చి మొక్కల మధ్య ఉన్న రెయిన్‌గేజ్

విద్యుత్ సబ్ స్టేషన్‌లో బైక్ చోరీ

బొమ్మలరామారం : మండలంలోని మర్యాల విద్యుత్ సబ్ స్టేషన్‌లో శనివారం రాత్రి బైక్ చోరీ జరిగింది. వివరాల ప్రకారం.. సబ్ స్టేషన్ ఆపరేటర్ మెరుగు పాండరీనాథ్‌కు చెందిన బైక్‌ను సబ్ స్టేషన్ ఆవరణలో పెట్టి ఆపరేటర్ గదిలో నిద్రపోయాడు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో వచ్చి ఆపరేటర్‌కు గదికి తాళాలు వేసి ఆవరణలో ఉన్న బైక్‌ను చోరీ చేశారు. పోలీసులకు, గ్రామస్తులకు ఆపరేటర్ పాండరీనాథ్ ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా వారు వచ్చి ఆపరేటర్ గది తాళం తీశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

రామన్నపేట : మండలంలోని వెల్లంకి గ్రామంలో మృతిచెందిన బలికె లక్ష్మమ్మ కుటుంబానికి ఆదివారం మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్‌రెడ్డి , బీఆర్ఎస్ నాయకుడు ఎడ్ల నరేందర్‌రెడ్డి, ఇడెం స్వరూపా స్మారక సేవా ట్రస్ట్ తరపున రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

గడ్డం వెంకటస్వామి సేవలు చిరస్మరణీయం



భువనగిరిటౌన్ : వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

భువనగిరిటౌన్ : కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి సేవలు చిరస్మరణీయమని భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తా వద్ద ఆయన జయంతిని నిర్వహించారు. దర్గాయి హరిప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, సేవాదళ్ రాష్ట్ర నాయకులు పిట్టల బాలరాజ్, నాగారం శంకర్, చుక్క స్వామి, కొండపురం గణేష్, దేవరకొండ మహేష్, ఎండి షరీఫ్, నాయిని ప్రవీణ్ కుమార్, సాల్వేర్ ఉపేందర్, గ్యాస్ చిన్న ,డాకురి ప్రకాష్, శంకర్ రాజు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశు వైద్యశాల



భూదాన్‌పోచంపల్లి : జూలూరులో శిథిల దశకు పశు వైద్యశాల భవనం



పెచ్చులూడిన పశు వైద్యశాల పైకప్పు

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని జూలూరు గ్రామంలోని పశు వైద్యశాల ప్రస్తుతం శిథిల దశకు చేరుకుంది. 1998లో ఈ భవనాన్ని నిర్మించారు. భవనం లోపల పై కప్పుకు సంబంధించిన సిమెంట్ స్లాబ్‌లు పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. వర్షం కురిసిన ప్రతిసారి పైనుంచి వర్షపు నీరు కారుతుండడంతో విధులు నిర్వహించేందుకు వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వైద్యశాలను కలెక్టర్ హనుమంతరావు సందర్శించారు. వైద్య సిబ్బంది భవన పరిస్థితిని కలెక్టర్‌కు వివరించారు. ప్రజాప్రతినిధులు స్పందించి నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

నడిరోడ్డుపై విద్యుత్ స్తంభం



రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

గుండాల : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో సీసీరోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సీసీ రోడ్డు వేసేటప్పుడు విద్యుత్‌స్తంభాన్ని తొలగించకుండానే రోడ్డు వేశారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేందుకు ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికై నా విద్యుత్ అధికారుల స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాన్ని తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గెలుపే ధ్యేయంగా పనిచేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మోటకొండూర్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే ధ్యేయంగా పనిచేయాలని బీఆర్ఎస్ మండల నాయకుడు జెట్ట మహేశ్వర్ అన్నారు. ఆదివారం మండలంలోని కాటేపల్లిలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంత్రి రాజు, ఏనుగు నాగిరెడ్డి, రాజు, ప్రభాకర్, నాగరాజు, భాను పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాబోయ్.. ఇదేం రోడ్డు



దుబ్బాక- మునిపంపుల గ్రామాల మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు

రామన్నపేట : రామన్నపేట మండల కేంద్రం నుంచి అమ్మనబోలు వరకు గల రోడ్డు గుంతలమయంగా మారి అధ్వానంగా మారింది. ప్రధానంగా దుబ్బాక – మునిపంపుల గ్రామాల మధ్య గల కల్వర్టు వద్ద రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. అడుగడుగునా మోకాళ్ల లోతు గుంతలు ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు మార్గంలో ప్రయాణించేందుకు జంకుతున్నారు. రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరైన పనులు చేపట్టడంలో జాప్యం జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు.

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

- కంకరతేలి గుంతలమయంగా మారిన రహదారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



బొమ్మలరామారం : నాగినేనిపల్లికి వెళ్లే రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంత



గుంతలమయంగా మారిన బోయిన్‌పల్లి రోడ్డు



ఖాజీపేట్ వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

బొమ్మలరామారం : మండలంలోని గ్రామీణ రోడ్లు ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోంతలమయంగా మారి అధ్వానంగా తయారయ్యాయి. కంకరతేలిన రోడ్లపై ప్రయాణించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చీకటిమామిడి నుంచి దేవుని తండా, లక్ష్మి తండా, గోవింద్‌తండా, కాండ్లకుండ తండా బీటీ రోడ్డు, పెద్ద పర్వతపూర్ మెట్టు మైసమ్మ ఆలయం వరకు , బొమ్మలరామారం నుంచి మల్యాల వరకు బీటీ రోడ్డు, మైసిరెడ్డి పల్లి నుంచి తిర్మలగిరి వరకు బీటీ రోడ్డు, సోలీపేట్ – తిమ్మాపూర్ వరకు గల బీటీ రోడ్డు.మండలంలోని రంగాపూర్ చౌరస్తా నుండి ఖాజీపేట్ మీదుగా తుర్కపల్లి మండలం మాధాపూర్ వరకు గల బీటీ రోడ్లు మరీ అధ్వసంగా ఉన్నాయి. మండలంలోని మల్యాల గ్రామం నుంచి ధర్మారెడ్డి గూడెం వరకు , హాజీపూర్ నుంచి మైలారం కింది తండా వరకు, తిమ్మాపూర్ – తుర్కపల్లి మండలం నాగయపల్లి వరకు గల రోడ్లపై కంకర పరిచి వదిలేశారు. దీంతో ఆయా మార్గాల్లో ప్రయాణించే వారికి ఇబ్బందులు తప్పడం లేదు.

మరమ్మతులు చేపట్టాలి



"మా గ్రామం నుంచి మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు మోకాళ్లోతు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. నిత్యం వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. బీటి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

– మైలారం సుదర్శన్, మల్యాల

ఇబ్బందులు పడుతున్నాం



"గ్రామానికి వచ్చే రోడ్డంతా గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. మండల పరిధిలోని రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసిన పట్టించుకోవడం లేదు.

– వద్యా రమేష్ నాయక్, బోయిన్‌పల్లి